# అరేబియా – ఓ అరేబియా

**– ఆర్.ఎస్.కె.మూర్తి**

అంతకుముందు నాలుగైదుసార్లు బొంబాయి వెళ్ళినవాడినే కాని ఎప్పుడూ ఎలిఫెంటా గుహలకు వెళ్ళి చూడటంమటుకు కుదరలేదు. ఈసారి ఏమైనాసరే, వాటిని చూసిరావాలని బయలుదేరాను. గేట్‌వే ఆఫ్ ఇండియా నుంచి మోటారు బోటులో ప్రయాణం.

మోటారు బోటు బయలుదేరింది. మా ముందంతా పరుచుకుని వున్న సముద్రం. ప్రకృతి జయించిన మానవుని విజయకేతనాలుగా దూరాన పెద్ద, చిన్న ఓడలు. ఆకాశం, నేల కలిసిపోయి ఒకటే అయిపోయిన అద్భుతవు భ్రాంతి!

"ఐయాం సుజన. ఐ విల్ బి విత్ యు ఆన్ దిస్ టూర్. ఆప్ కో సబ్ కుచ్ మై దిఖాయీదూంగీ అవుర్ ఎక్స్‌ప్లయిన్ కర్‌దూంగీ...".

అరేబియా అద్భుతాలలో తేలిపోతున్న మమ్మల్ని పట్టిలాగిన గొంతు. అందరి చూపులూ అటు మళ్ళినై. పాతికేండ్ల యువతి. పంజాబీ డ్రస్సులో వుంది. పెదిమలకు ఇటుక రంగు లిప్‌స్టిక్. గండుముఖం. మెడల వరకు కత్తిరించిన జుట్టును చేత్తో సర్దుకుంటూ, హిందీ యింగ్లీషు భాషలను కలగలిపి మాట్లాడుతున్నది – సుజన.

ఓహో – ఈ బోటు వారు గైడ్‌ను కూడా పంపుతారన్నమాట! గైడ్ అని నాకు తెలియదు కాని, నేనైతే ఆమెను బోటులోకి రాంగానే గమనించాను. డెక్ మీద కుర్చీలు ఖాళీగా వున్నా, క్యాబిన్ వెనకాల బెంచీమీద విరిగిన బొమ్మలా కూల బడి వున్నదామె. డెక్ మీది అందరూ అరేబియా ఆవిష్కరిస్తున్న అద్భుతాలను తిలకిస్తుంటే, ఈ అమ్మాయి ఏమిటిలా కీ అయిపోయిన బొమ్మలా కూచున్నదని నాకప్పుడే అనిపించింది. ఇప్పుడే సుజన, పైనాలుగు మాటలు పలికి, మళ్ళీ ఆ బెంచీ మీదనే నిరాసక్తంగా కూర్చోవడం చూస్తే.. మళ్ళీ కీ అయిపోలేదు గదా – అనిపించింది. బోటు సాగిపోతుంటే నూతన లోకాల పరిజ్ఞానం ఆమెను మనసు తెరల మాటుకు నెట్టివేస్తున్నది.

"ఇదిగో యిది నావీ వారి ముఖ్యకేంద్రం... ఇది ఆయిల్ పయర్. వీటి ఫోటోలు తీయకండి ప్లీజ్..." కీ యిస్తే బొమ్మ యాక్టివైజు అయినట్టున్నది. గలగలా హిందీ యింగ్లీషులు కొట్టిపోస్తున్నది. పయర్ మీద అన్‌లోడ్ అయ్యే ఆయిల్ సముద్రపు అడుగున నిర్మించే పైపుల ద్వారా రిఫైనరీలకు చేరుతుందిట! అన్నీ నిజాలే చెప్తున్నదా – ఈ సుజన!

గలగలా మాటలు కొట్టిపోసిన మరుక్షణంలో స్విచ్ ఆఫ్ అయిన టి.విలా ఆగిపోవడం... మళ్ళీ అంతలోనే కొండవాగులా గలగలలాడడం – ఇదేమిటీ మనిషి? నాకేదో తమాషానే అనిపించింది.

"ఇంకో పది నిమిషాల్లో మనం ఎలిఫెంటా గుహలు చేరుకుంటాం. పయర్ నుంచి మెట్ల వరకు పది నిమిషాలు నడక. అక్కడో నూట పది మెట్లెక్కాలి. ఖావా, పీనా అన్నీ మళ్ళీ దిగి వచ్చిన తర్వాతనే. మనం మెట్లెక్కిన తర్వాత కలుసుకుందాం. త్వరగా రావాలి, ప్లీజ్..."

నూట పది అంకెను మూగవారి వార్తల్లో లాగ వేళ్ళతో వేసి చూపెడుతూ, మాట్లాడే బొమ్మ ఆగిపోయింది. ఆ నూట పది అంకె నా గుండెను పట్టుకున్నది. గుండెపోటు వచ్చిన వాడిని. ఒంటరివాడుగా నూట పది మెట్లు ఎక్కగలనా? పర్సులో సార్బిట్రేట్ మాత్రలు వున్నాయా? అమ్మయ్య, వున్నాయి. బొంబాయిలో బసచేసిన ఆంధ్రమహాసభ వారి అడ్రసు, ఫోన్ నెంబరు? ఆ... పర్సులో కార్డు మీద వున్నయి! హమ్మయ్య!

ఏమిటీ జీవిబంధాలు! అరేబియా సముద్రం మధ్యలో తాను పడిపోతే, ఆ వార్త తనవాళ్ళకు చేరుతుందనే ఈ తృప్తి ఏమిటి? వాళ్ళకు చేరాలనే తాపత్రయమేమిటి?

బోటు ఆగంగానే సుజనతోపాటు చాలామంది చకచకా నడిచివెళ్ళారు. నేను మెట్ల దగ్గరకు చేరేసరికి, నాకక్కడో పరమాద్భుతం తెలిసింది. అరేబియా సముద్రంలోని ఒక చిన్న దీవి అది. దానిపై అన్నీ కొండలే. ఆ కొండగుహల్లో శిల్పాలు చెక్కించింది ఎవరో కాదు – 10, 11 శతాబ్దాలకు చెందిన చాళుక్య రాజు – రెండవ పులకేశి. అప్పుడా ద్వీపం పేరు ఘోర్‌పురి! ఎక్కడి చాళుక్యరాజులు – ఎక్కడి ఘోర్‌పురి! వాళ్ళొచ్చి యిక్కడ శిల్పాలు చెక్కించడమేమిటి? తెలుగు రాజుల వైభవం!

అదోరకమైన అనుభూతితో గుండె తేలికైంది. అన్ని మెట్లు అనాయాసంగా ఎక్కి వెళ్ళాను. సుజన సూచన మిగతావాళ్ళు పాటించారో లేదో? నేను మటుకు పాటించాను. కాఫీ తాగాలని నాలుకు పీకినా నిగ్రహించుకున్నాను. గ్లాసెడు మంచినీళ్ళు మటుకు కొనుక్కుని తాగాను. గ్లాసు ఖరీదు అర్ధరూపాయి. అవును మరి, ఉప్పనీటి సంద్రం మధ్యలో తియ్యటి మంచినీళ్ళు! వాటర్ వాటర్ ఎవ్విరీవేర్ – బట్ నాట్ ఎ డ్రాప్ టు డ్రింక్ – చుట్టూ జలమే అయినా తాగటానికి ఒక్క బొట్టు లేదని దొరపిల్లాడు కదా ఆంగ్లకవి కాల్‌రిడ్జ్! అర్ధ రూపాయంటే చౌకేమరి.

కాని కొండమీదికి వెళ్ళి చూస్తే ... అక్కడ మంచి నీటి చెలమ ఒకటి కన్పించింది. పక్కనే బొక్కెన. చల్లటి తియ్యటి నీళ్ళు. వ్యాపార సంస్కృతి అరేబియాను అధిగమించి వచ్చినదన్నమాట!

* * *

ఎలిఫెంటా గుహలంటే అవేవో పాశ్చాత్య శిల్ప కళా వైభవాలన్న అభిప్రాయం వుండేది నాకు. తీరా చూస్తే అవి శిథిలపరమేశ్వరాలయాలు. గుహ మధ్యలో శిలలింగం. గర్భగుడి. చుట్టూ గోడలపై శివపార్వతుల గాథలు చెక్కబడి వున్నయి. నేను చేరేటప్పటికి సుజన మొదటి కుడ్యచిత్రం (పానెల్) వివరిస్తున్నది – ఫూ బోటులో వచ్చిన వారికి. హిస్టరీ మేస్టారులా పాయింటరుతో బొమ్మలను చూపిస్తే ఇంగ్లీషు, హిందీల్లో గలగలమంటున్నది.

"మన హిందూ సాంప్రదాయంలో మనం దేవతలనే కాదు, పశు పక్ష్యాదులను కూడా దేవుళ్ళుగానే పూజిస్తాం. నందీశ్వరుడు, గరుత్మంతుడు – వీరిని కూడా ఆరాధిస్తాం. మనది ప్రధానంగా వ్యావసాయిక దేశం కదా! అందుకని పశువులు, పక్షులు కూడా మనకు పూజనీయులే!"

ధార్మిక భావనలను నిత్యజీవిత వాస్తవాలతో రేషనలైజ్ చేస్తున్న సుజన! భాషావైదుష్యమే కాక, ఆలోచనా పటిమ కూడా వున్నదా – ఈ పంజాబీ యువతిలో! పాపం, ఈ గైడ్ ఉద్యోగమేమిటో?

"నౌ ఉయ్ షల్ మూవ్ ఆన్ టు ది నెక్స్ట్ ప్యానెల్" – అంటూ ఒకదాని నుంచి మరొకదానికి జనాలను నడిపించుకుపోతున్నది – సుజన. పైడ్ పైపర్ ఆఫ్ హామిలన్ *Pied Piper of Hamilin* లాగానా!

"పార్వతీ పరమేశ్వరులు పాచికలాడారు. పార్వతి ఓడిపోయింది. ఓటమి ఉక్రోషం తెచ్చింది. పతికి పెడమొగమై కూచున్నది, చూచారా? మన యిళ్ళల్లో ఆడవాళ్ళకు కోపం వస్తే భర్త బ్రతిమిలాడుతారు కదా! పరమేశ్వరుడలా బ్రతిమిలాడుతున్నారు, చూశారా? పార్వతీ పరమేశ్వరులంటే మరెవరో కాదు, మన సంప్రదాయంలో ఆదిదంపతులు".

అదో ముగ్ధంతో చెప్పకుపోతున్నది సుజన. భువికి, దివికి వంతెనలేవో నిర్మిస్తున్నది. ఈమెకు వైవాహిక జీవితపు సొబగులు కూడా తెలుసే? వివాహితురాలా ఈమె?

గబగబా మాటలు కొట్టిపోస్తూ, ప్యానెల్ నుంచి ప్యానెల్‌కు ఆమె పరుగులు పెట్టడం చూస్తుంటే ... ఈ సుజన ఏదన్నా గతం నుంచి పారిపోతున్నదా – అనిపించింది.

మరో బోటు వచ్చినట్టున్నది. అందులో వచ్చిన వారందరూ విదేశీయులే. వారికి గైడ్‌గా ఒక నూట్‌వాలా. అతనూ సుజన చెప్పిన మాటలే చెప్తున్నాడు. కాని సుజనలోని నిబద్ధత అతనిలో కన్పించలేదు.

అర్ధనారీశ్వరుని శిల్పం ఒకటున్నది అక్కడున్న

ఎనిమిది కుడ్య చిత్రాలలో. ఆ శిల్పంలో ఎడంచే తికి గాజులుండడం, కుడిచేతికి పాము చుట్టబడి వుండడం – పాయింటరుతో ప్రత్యేకంగా చూపించింది సుజన. "ప్రకృతీ, పురుషుడూ యిద్దరూ ఒకటే. ఇద్దరూ ఈ సృష్టికి అవసరమే". సుజన పాఠం సాగిపోతున్నది. నాకో చిలిపి ఊహ వచ్చింది. సృష్టికి సహకరిస్తూ స్త్రీ పురుషులు ఏంచేస్తారో ఈ అమ్మాయికి తెలుసా? ఆటు తర్వాత తెలిసింది – సుజవ పిల్ల తల్లి అని! అన్ని శిల్పాలలాగ అర్ధనారీశ్వర శిల్పం కూడా శిథిలమే అయి వుండడం నా మనసునెంతగానో పిండివేసింది. అర్ధనారీశ్వర భావమే శిథిలమైతే???

గుహలోకి మనం ఉత్తరం వైపునుండి ప్రవేశిస్తాం. గుహ మధ్యలో శివలింగం. గర్భగుడి. దీనికి ఆవల ఎదురుగుండా గోడపై మహేశ్వర మూర్తి – మూడు తలలున్న శిల్పం. అక్కడున్న శిల్పాలన్నింటిలో ధ్వంసం కాకుండా వున్నది – అదొక్కటే.

"ఇవి చూడంగానే మనం బ్రహ్మవిష్ణు మహేశ్వరులనుకుంటాం" సుజన పాఠం మొదలైపోయింది. కాని ఆ ముగ్గురూ పరమేశ్వరులేనట. "మన మన పురాణాలలో బ్రహ్మ విష్ణు మహేశ్వరులంటే సృష్టి స్థితి లయ కారకులు. ఇందులో పరమేశ్వరుడే పరబ్రహ్మమన్నట్లుగా చిత్రించారు, చూశారా? ఒక తలకు చెందిన చేతిలో కమలం. సృష్టికర్తకు చిహ్నం. రెండో చేతిలో దానిమ్మపండు. స్థికారకునకు ప్రతీక. మూడవ చేతిలో నాగరాజు. లయ కారకుడు. ఈ ముగ్గురూ వేర్వేరు కాదన్న అబేధభావం ప్రకటించే శిల్పమిది."

"మరైతే యిది ధ్వంసం కాలేదెందువల్ల?" "దీని ముందు ఇనుప చట్రముండేది. అవిగో, గుహపై కన్పన ఆ రంధ్రాలు చూడండి. అవా చట్రం బిగించిన రంధ్రాలే. ఆ చట్రం వల్ల యిది ధ్వంసం కాలేదు.'

"ఆంటీ, అసలివన్నీ ఎవరు ధ్వంసం చేశారు?" – ఒక పన్నెండేళ్ళ కుర్రాడు అడిగాడు.

"పోర్చుగీసువారు. బుడతకీచులు *(The Dwarfs)*".

"ఎందుకిలా ధ్వంసం చేశారాంటీ?" ఒక కాన్వెంటు పిల్ల నిర్వేదంతో అడిగింది.

"జెలసీ. అసూయ. జనాలందరూ వచ్చి, యిక్కడ పూజలు చేస్తున్నారని అసూయ".

"అంటే యిక్కడంతా జనాలుండేవారా?" – ప్రశ్న నాది.

"అవును సర్. ఘోర్‌పురి అనే ఊరు యిక్కడ వుండేదిట" అంటే విధ్వంసకులను అరేబియా ఆప లేకపోయిందన్నమాట! ఎక్కడి చాళుక్య ప్రభువులో వచ్చి, యిక్కడ ఆలయాలు నిర్మించటమేమిటి? మరెక్కడి బుడతకీచులో వచ్చి, వాటినిధ్వంసం చేయడమేమిటి?

అరేబియా, ఓ అరేబియా – అని ఏడవాలనిపించింది.

* * *

మొదటి గుహలో మాటుకే కుడ్య శిల్పాలు, గర్భగుడి – ఇదంతా పూర్తి అయిందట. మిగతా గుహలన్నీ ఖాళీయేనట! "కావాలనుకున్నవాళ్లు వాటిని వెళ్ళి చూచిరండి. ఒంటిగంటకు బోటు. ఆ బోటు అందుకోకపోతే యిబ్బందిపడతారు" సుజన అందరికీ వీడ్కోలు చెప్తేస్తున్నది.

"ఇంకో బోటులో రానివ్వరా?" ఆదుర్దా ప్రశ్న నాదే.

"ఒకరిద్దరు మీలాంటి పెద్దవాళ్ళను రానిస్తారులెండి, సర్" ముసలి వాళ్ళపై మమత చూపించింది – సుజన.


లంచ్‌గా తెచ్చుకున్న శాండ్‌విచ్‌లు తింటున్నది – సుజన. దగ్గరకు వెళ్ళి మాటలు కలిపాను.

"అవునూ, వీటిని ఎలిఫెంటా గుహలని ఎందుకంటారు?"

"ఈ మొదటి గుహ ముందు పెద్ద ఏనుగు శిల్పం వుండేది సర్. దానినైతే పూర్తిగా ధ్వంసం చేశారు" సుజన దగ్గర సమాధానం లేని ప్రశ్న లేదల్లే వుంది.

"మిస్ సుజనా... మీరు గ్రాడ్యుయేటా, పోస్టు గ్రాడ్యుయేటా?"

"ఐ యాం ఎ మదర్, సర్. (నేను బిడ్డ తల్లిని)"



రెంగో గుహ మటుకు చూచివచ్చాను. అందులో రెండే ప్యానల్సు చెక్కి వున్నాయి. శివలింగం ప్రతిష్ఠించబడి వుంది. కాని వాకీ గుహలు, కుడ్యాల కంటే సుజనే ఎక్కువగా ఆసక్తి కలిగించింది. అంత గొప్పగా మాట్లాడుతున్న యువతి... బాగా చదువుకున్నదే అయి వుంటుంది. ఆమెకీ సముద్రాల ఆవల ఉద్యోగమేమిటి? స్వయోత్సాహంతో... హాబీగా.. చేస్తున్నదేమో?

గుహల బయట వున్న పెద్ద చెట్టు నీడన కూచుని

.న్పన వెలుగుతున్న దీపం కొడిగట్టినట్టు మార్పులు వచ్చినై – ఆ గండుముఖంలో.

"ఓ... సారీ. కానీ, సంతోషమమ్మా! ఈ చారిత్రక శిథిలాలపై వుండే ఆసక్తితో... యిట్లా గైడుగా పనిచేస్తున్నారా, మిసెస్ సుజనా? మీవారు మీకు బాగా సహకరిస్తారా ఏమిటి?" నవ్వుతూ, ఆమె పెదిమలపై చిరునవ్వు చూడాలని ఆశించాను.

చిరునవ్వు కనిపించింది గాని, అందులో విషాద వ్యంగ్యం!

"ఏం, శిథిల జీవితాల వారి శిథిలాల మధ్య అన్నం మెతుకులు ఏరుకోకూడదా, సర్?"

నిర్ఘాంతపోయాను. నెమ్మదినెమ్మదిగా ఆమె కథ రాబట్టాను.

* * *

విపరీతాల జీవితం – సుజనది. ఆమె పంజాబీ యువతి కాదు. తెలుగు వారమ్మాయే. నిజామాబాద్ జిల్లా నుంచి వచ్చి, మాతుంగాలో స్థిరపడిన నేతపనివారి కుటుంబం ఆమెది. ఆమె హిస్టరీలో పోస్టుగ్రాడ్యుయేట్. చరిత్ర, సముద్రమధ్యంలో చాళుక్య రాజులు చెక్కిన శిలాలు ధ్వంసం కావడం – వాటిమీద ఆసక్తితోనే ఆమె గైడ్ పని చేపట్టింది హాబీగా. వచ్చేపోయే టూరిస్టులు ఆమెపై రకరకాల ప్రభావాలు చూపించేవారు. వెంకట్. ఇంజనీరు. విజయవాడవాడు. ఉద్యోగార్థియై బొంబాయి చేరాడు. గుహలను చూడవచ్చి సుజనకు దగ్గరైవాడు. వరుసగా రోజూ ఆమె బోటులోనే రావడం... ఆమెకు సన్నిహితంగా మసలడం.. యిట్లాంటి మాయాజాలంతో ఆమె మనసు దోచుకున్నాడు. అర్ధనారీశ్వరుని ప్యానెల్ ముందే వారు భార్యాభర్తలైనారట – తమ మనస్సులే సాక్షులుగా! చాళుక్య ప్రభువుల వారసుడు కదా – అది తన అదృష్టమనుకున్నదిట!

తర్వాతేముంది, ఫార్ములా కథే! వారికో ఆడపిల్ల పుట్టింది. ఇంతలో స్వంత రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. తమవారి ప్రభుత్వం వచ్చింది. నిరుద్యోగి ఇంజనీరు వెంకట్ పెద్ద ఉద్యోగి అయిపోయాడు. ప్రభుత్వంలో ఒక విభాగానికి టెక్నికల్ ఎడ్వయిజరు. లక్షల కట్నంతో పెళ్ళికూతురు వచ్చి నిలిచింది. "మరైతే యిప్పుడు నీకు మొగుడుగా కంటిన్యూ కాలేదు. మన మధ్య, వివాహ బంధమే లేదు గదా. సో, గుడ్‌బై" తలాక్, తలాక్ చెప్పకుండా ఇంగ్లీషులో గుడ్‌బై చెప్పేశాడు, వెంకట్. మరో బీబీనాంచారమ్మను ఆశిస్తూ వెళ్లిపోయాడు వెంకటేశ్వరస్వామి! పాడిజానికి మానవరూపంగా!

'నాకేదీ బాధ లేదుగాని సర్, వివాహ బంధమే లేదన్నాడా రాస్కెల్. మా కూతురు బన్నీ ఏ బంధానికీ సాక్ష్యం కాదా?"

ఆ ప్రశ్నకు నేనేమి సమాధానం చెప్పగలను?

"నాకేదో మూటలొస్తున్నయి. వాటి వెంబడి వెళ్తున్నాను. మనం ఫ్రెండ్స్‌గా విడిపోదాం సుజీ – అని ఒక్కమాట వాడు అని వుంటే... నేనీ బాధను సుఖంగా భరించేదాన్ని. కదా సర్"

సమాధానం లేని ప్రశ్నలు లేవు – సుజన విషయంలో.

సుజన ప్రశ్నలకు వేటికీ నా దగ్గర సమాధానాలు లేవు.

సాంప్రదాయికపు వివాహం... దాని ప్రాధాన్యతా... వీటి పవిత్రతల గురించి లెక్చరిచ్చి... ఆ హిస్టరీ విద్యార్థినిని అవమానించలేను. సుజన సౌజన్యాన్ని నొప్పించలేను.


అంతులేని సంద్రాలను అధిగమించాడు మనిషి!

అతనిలోని దురాశ, ప్రలోభాలు, పైసల వ్యామోహాలు – యివీ సంద్రాలను అధిగమించి విస్తరిల్లుతూనే వున్నాయి.

అరేబియా. ఓ అరేబియా – అని లేని సౌందర్యాలను ఊహించుకుని ఉప్పొంగిపోయాడో ఆంగ్ల కవి! వాల్టర్ డిలామూర్.

అరేబియా... పూర్ అరేబియా – అని బావురుమంటున్నది నా మనసు – శిథిలాల గైడ్ సుజన జీవిత శిథిలాలను పరికించి!

# వాస్తు సుఖదుఃఖాలు



వాస్తు శాస్త్రమే. కాదనడం లేదు. అయితే ఏది వాస్తు! ఏది కాదు! అని చెప్పలేని పరిస్థితి.

ప్రతీ పేటలోనూ, ప్రతి ఆఫీసులోనూ...అంతెందుకు పది మందిలో పదకొండు మంది వాస్తు 'పరిజ్ఞానం' వున్న వారు పుట్టుకొస్తున్నారు. ఒక వాస్తుశాస్త్రవేత్త చెప్పినట్లే ఇల్లు కట్టుకుంటారు. అయితే మరో శాస్త్రవేత్త వచ్చి 'ఎవడండీ ఈ ఇంటికి వాస్తు చెప్పింది! ఆ తూర్పువైపు వున్న గోడను పడగొట్టి పడమటివైపు కట్టండి. ఇంటిముందు వేసిన బోరు బావిని పూడ్చేసి ఇంటి వెనక ఈశాన్యంలో బోరు వేయండి.' అని జడిపిస్తాడు.

ఈ పెద్దమనిషి చెప్పినట్టు చేసినా ఇంకొకరు వచ్చి మళ్లీ ఏదో వంక చెబుతారు.

ఈ కాలంలో 'వాస్తు' గృహస్తులను భయపెడుతోంది. "వాస్తు ప్రకారం ఇల్లు కట్టాము" అనే తృప్తి దాదాపు ఎవరికీ మిగలడం లేదు.

వాస్తు ప్రకారం ఇల్లు కట్టడం వల్ల కొన్ని శుభాలు జరిగి వుండవచ్చు. కట్టకపోవడం వల్ల కొన్ని నష్టాలు జరిగివుండవచ్చు. శాస్త్రవేత్తలు చెప్పినదల్లా వినడం వల్ల ఆర్థికంగా కొన్ని నష్టాలు జరిగి వుండవచ్చు.

మీ అనుభవాలన్నింటినీ వ్రాసి ఈ కూపన్‌ను కవరుమీద అంటించి మాకు పంపండి

అనుభవాలను పంపవలసిన చిరునామా:

వాస్తు సుఖదుఃఖాలు
ఎడిటర్,
ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక
రోడ్‌నెం.8, బంజారాహిల్స్
హైదరాబాద్ 34.